# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 19-10-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2822 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 61 | పేజీలు:6 | వెల: రూ.1/-


## కేదార్‌నాథ్‌లో కూలిన హెలికాప్టర్.. ఆరుగురు మృతి

డెహ్రాడూన్, అక్టోబర్ 18:కేదార్‌నాథ్‌కు భక్తులతో వెళ్తున్న ఓ హెలికాప్టర్ కుప్పకూలింది. ఇద్దరు పైలెట్లతో పాటు మొత్తం ఆరు మంది ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఫటా నుంచి భక్తులతో హెలికాప్టర్ బయలుదేరింది. హెలికాప్టర్ కూలిన ప్రదేశంలో భారీగా పొగలు వ్యాపించాయి. చెల్లాచెదురుగా హెలికాప్టర్ శిథిలాలు పడి ఉన్నాయి. ప్రమాదం జరిగిన ప్రాంతానికి రెస్క్యూ సిబ్బంది వెళ్లినట్లు అధికారులు చెప్పారు.

ఉత్తరాఖండ్‌లోని హిమాలయాల్లో జ్యోతిర్లింగ క్షేత్రం కేదార్‌నాథ్ ఉన్న విషయం తెలిసిందే. సాధారణంగా వేసవి కాలం నుంచి ఆలయం దర్శనం కోసం తెరి ఉంచుతారు. దీపావళి వరకు ఈ ఆలయంలో భక్తులకు దర్శనాలు ఉంటాయి. అయితే ట్రెక్కింగ్ చేయలేని భక్తుల కోసం.. హెలికాప్టర్ సేవలు అక్కడ అందుబాటులో ఉంటాయి. కేదార్‌నాథ్‌లో ఇవాళ హెలికాప్టర్ విషాదం చోటుచేసుకోవడం శోచనీయం.

## మునుగోడులో బీజేపీ డబ్బునే నమ్ముకుంది : టీఆర్ఎస్ ఎమ్మెల్సీ

హైదరాబాద్, అక్టోబర్ 18: మునుగోడు నియోజకవర్గం ఉప ఎన్నికలో గెలిచేందుకు బీజేపీ డబ్బునే నమ్ముకుందని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ భాను ప్రసాద్ ధ్వజమెత్తారు. డబ్బులతో ఓట్లను కొనేందుకు బీజేపీ చూస్తోందన్నారు. మునుగోడు ప్రజలు చైతన్యవంతులు.. బీజేపీకి తప్పకుండా బుద్ధి చెబుతారని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

టీఆర్ఎస్ఎల్సీలో భాను ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. నిన్న బీజేపీ నేత వద్ద రూ. కోటి దొరికాయి. మునుగోడు బీజేపీ ప్రవహింపజేస్తున్న ధనానికి ఆ ఘటనే నిదర్శనం అని చెప్పారు. బీజేపీ నాయకుల మాటలకు మునుగోడు ప్రజలు లొంగరని స్పష్టం చేశారు. బీజేపీ నాయకులు బేవకూఫ్ మాటలను బంద్ చేయాలన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు నాయకులు పార్టీలు మారడం సహజమన్నారు. తమ పార్టీలోకి కొంత మంది నేతలు వస్తారని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రులకు సబ్జెక్ట్ లేదన్నారు. మిడి మిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దేశ ప్రతిష్ఠను మంటగలుపుతున్నారని ధ్వజమెత్తారు. ఏం మాట్లాడుతున్నారో ఆమెకే అర్థం కావడం లేదన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో బీజేపీ ఏం చేస్తుందో స్థానిక ప్రజలకు తెలుసన్నారు. కావాలంటే తెలంగాణ, ఆ రాష్ట్రాల అభివృద్ధిని పోల్చి చూడాలని భాను ప్రసాద్ పేర్కొన్నారు.

## కాగ్నిజెంట్ ఉద్యోగులకు గుడ్‌న్యూస్ : పది శాతం వేతన పెంపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: టీసీఎస్, విప్రో బాటలోనే కాగ్నిజెంట్ తమ ఉద్యోగులకు తీపికబురు అందించింది. ఉద్యోగులకు పది శాతం నగటు వేతన పెంపు వర్తింపచేయనుంది. ఈవారంలో ఉద్యోగులందరికీ నూతన వేతన ప్యాకేజ్‌ను వెల్లడిస్తూ ఈ–లెటర్స్ అందచేస్తామని కాగ్నిజెంట్ తమ సిబ్బందికి ఇప్పటికే వెల్లడించింది.

అసోసియేట్ డైరెక్టర్ వరకూ అన్ని లెవెల్స్‌లోని ఉద్యోగులకు అక్టోబర్ నుంచి వేతన పెంపు అమలవుతుందని కాగ్నిజెంట్ పేర్కొన్నట్టు సమాచారం. కాగ్నిజెంట్ తమ ఉద్యోగులకు ఏడు నుంచి పదిశాతం మధ్య వేతన పెంపు వర్తింపచేసినట్టు మరికొన్ని నివేదికలు వెల్లడించాయి.

జూన్ 30తో ముగిసిన క్వార్టర్‌లో కంపెనీలో స్వచ్ఛంద అట్రిషన్ రేటు 31 శాతంగా నమోదైంది. బీపీఓ, ట్రైనీస్, కార్పొరేట్ అసోసియేట్స్‌ను పరిగణనలోకి తీసుకుని చూస్తే అట్రిషన్ రేటు పరిశ్రమ ప్రమాణాలకు లోబడే ఉందని కాగ్నిజెంట్ ఎగ్జిక్యూటివ్స్ చెబుతున్నారు. ఇక టీసీఎస్, విప్రో ఇప్పటికే తమ ఉద్యోగులకు వేతన పెంపు, ఇన్సెంటివ్‌లను ప్రకటించాయి.

## మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేత



భద్రాద్రికొత్తగూడెం, అక్టోబర్ 18 (నేటి నిజం ప్రతినిధి)జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు విధులు నిర్వర్తిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఏఆర్ఎస్సై యాసిన్ కుటుంబానికి భద్రతా ఎక్స్‌గ్రేషియా 8 లక్షల రూపాయల చెక్కును ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డా.వినీత్.జి అందజేశారు. భద్రాచలం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ కాన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి 1లక్ష రూపాయల చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు మరియు సిబ్బంది తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని ఆరోగ్యాల పట్ల శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ సత్యవతి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఏసోబు లు పాల్గొన్నారు.

## టీఎస్ ఐసెట్ మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తి

హైదరాబాద్, అక్టోబర్ 18: : టీఎస్ ఐసెట్ మొదటి విడుత సీట్ల కేటాయింపు మంగళవారం జరిగింది. ఎంబీఏలో 86.44 శాతం సీట్లు భర్తీ కాగా, ఎంసీఏలో 99.82 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఎంబీఏలో 20,336 సీట్లు భర్తీ కాగా, 3,189 సీట్లు మిగిలాయి. ఎంసీఏలో 2,673 సీట్లు భర్తీ కాగా, కేవలం 3 సీట్లు మాత్రమే మిగిలాయి. ఆయా కాలేజీల్లో సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని ఐసెట్ అధికారులు సూచించారు. ఈ నెల 28 నుంచి 31 వరకు సర్టిఫికెట్లను కాలేజీల్లో సమర్పించాలన్నారు.

### చరిత్రలో నేటినిజం



(అక్టోబర్ 19 సన్నిడియోల్ పుట్టిన రోజు..)

–రాధశ్రీ

సెల్:9494481210



## మూడేండ్ల లో చేయని అభివృద్ధి ఏడాదిలో చేస్తారా ? : మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మునుగోడు, అక్టోబర్ 18: మునుగోడు ఎమ్మెల్యేగా పనిచేసిన రాజగోపాల్‌రెడ్డి ఉప ఎన్నికల్లో గెలిస్తే ఏడాదిలో అభివృద్ధి చేస్తానని బీరాలు పలుకుతున్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. మునుగోడు ఎన్నికల ప్రచారంలో భాగంగా నాంపల్లిలో మంత్రి మీడియాతో మాట్లాడారు. గెలిచిన తరువాత నియోజకవర్గం ముఖం చూడని రాజగోపాల్ రెడ్డిని నియోజకవర్గ ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు.

వ్యక్తిగత స్వార్థం కోసం ఎన్నికలు తీసుకొచ్చిన ఆయనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు.కాంట్రాక్టులపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై కనీస అవగాహన లేదని మండిపడ్డారు. గెలిస్తే మునుగోడుకు వెయ్యి కోట్లు తీసుకొస్తానని ప్రచారం చేసుకుంటున్న బీజేపీ అభ్యర్థి దుబ్బాక, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు ఎందుకు తీసుకురాలేకపోయారని విమర్శించారు .

బీజేపీ నాయకులు ఏక వచనంతో మాట్లాడడం శోచనీయమని తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందేందుకు బీజేపీ అడ్డదారులు తొక్కుతుందని అందుకు బీజేపి కార్పొరేటర్ వద్ద కోటి రూపాయలు దొరకడం ఒక నిదర్శనమని తలసాని ఆరోపించారు. మునుగోడులో ఫ్లోరోసిస్ లేకుండా చేసిన ఘనత కేసిఆర్‌దేనని మంత్రి పేర్కొన్నారు. మునుగోడులో టీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలుస్తుందని ధీమాను వ్యక్తం చేశారు.

## కూసుకుంట్లను భారీ మెజార్టీతో గెలిపించాలి : టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



చౌటుప్పల్, అక్టోబర్ 18: మునుగోడు నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని భువనగిరి ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, ఆందోల్ ఎమ్మెల్యే కిరణ్ ఓటర్లను కోరారు. మంగళవారం చౌటుప్పల్ మండలంలోని జైకేసారం గ్రామంలో భువనగిరి శాసనసభ్యులు శేఖర్ రెడ్డి సీపీఎం, సీపీఐ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకుపోతుందని వివరించారు. పేదల అభివృద్ధికి కట్టుబడి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. అధికారంలో లేని వ్యక్తులకు ఓటేస్తే అభివృద్ధి జరుగదని కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి ఓటువేస్తే అభివృద్ధి మరింత త్వరితగతిన జరుగుతుందని వెల్లడించారు. చౌటుప్పల్ మండలంలోని ఎన్ లింగోటం గ్రామంలో ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సీపీఐ, సీపీఎం కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభాకర్ రెడ్డి కి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

కూసుకుంట్ల కుటుంబ సభ్యుల ప్రచారం

టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఇవాళ మండలంలోని పుల్లెంల గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ప్రభాకర్‌రెడ్డి సతీమణి అరుణ ,కోడలు ప్రతి గడప గడపకు వెళ్లి మహిళ ఓటర్లకు బొట్టుపెట్టారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరిస్తు కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వారి వెంట టీఆర్ఎస్ నాయకులు ,కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## జీనోమ్ వ్యాలీలో రూ. 1100 కోట్ల పెట్టుబడులకు కేటీఆర్ శంకుస్థాపన



హైదరాబాద్, అక్టోబర్ 18: రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్ రంగం విలువ 2030 నాటికి 100 బిలియన్ డాలర్లు చేరేలా తెలంగాణ ప్రయాణం కొనసాగిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

ఆ లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రయాణాన్ని సాగిస్తున్నామని తెలిపారు. జీనోమ్ వ్యాలీలో రూ. 1100 కోట్ల విలువైన బయో ఫార్మా హబ్ సహా ఐదు ప్రాజెక్టులకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. జీనోమ్ వ్యాలీ స్పేస్ కోసం రోజురోజుకు డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. అనేక కొత్త కంపెనీలు రావడంతో పాటు ఇప్పటికే కొన్ని కంపెనీలు తమ విస్తరణను చేపట్టాయని పేర్కొన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో పెట్టుబడులతో దేశంలోనే జీనోమ్ వ్యాలీ కీలకంగా ఎదిగిందని మంత్రి స్పష్టం చేశారు. జీనోమ్ వ్యాలీ తెలంగాణతో పాటు దేశానికి ఎంతో కీలకమైందన్నారు. జీవ ఔషధ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు.

ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి, కంపెనీల విస్తరణతో రానున్న రోజుల్లో 20లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంగల స్పేస్ అదనంగా తోడవుతుందన్నారు. రూ. 1100కోట్ల పెట్టుబడితో ప్రారంభించిన ఈ ఐదు ప్రాజక్టుల ద్వారా మూడువేలమందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు ఆయన చెప్పారు.

దేశంలోని అన్ని క్లస్టర్లలో ఉన్న ప్లగ్ అండ్ ప్లే సౌకర్యంకన్నా ఎక్కువ ప్లగ్ అండ్ ప్లే సౌకర్యం జీనోమ్ వ్యాలీలో ఉన్నదని, ఇంకా విస్తరిస్తున్నామన్నారు.

మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ అనుకూల విధానాలు, నాణ్యమైన వర్క్‌ఫోర్స్, ఓవర్ ఆల్ ఇకోసిస్టం తదితర అంశాలు జీనోమ్ వ్యాలీని అత్యంత ఆకర్షణీయ లైఫ్ సైన్సెస్ క్లస్టర్‌గా తీర్చిదిద్దిందన్నారు. సీఆర్ఓలు, సీడీఎంఓలు ఉన్నాయని, సింజీన్, లారస్, క్యూరియా తదితర అనేక సీఆర్ఓలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు.

భవిష్యత్తులో మరిన్ని కంపెనీలు రానున్నాయన్నారు. వ్యాక్సిన్ల అభివృద్ధిలో తెలంగాణ ముందంజలో ఉందని, కోవిడ్ వ్యాప్తిస్తున్న సమయంలో వ్యాక్సిన్ల ఉత్పత్తిలో అత్యంత కీలకపాత్ర పోషించిందని కేటీఆర్ తెలిపారు.

## హైదరాబాద్‌లో దారుణం.. నాలుగేళ్ల చిన్నారిపై ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపల్ కారు డ్రైవర్ అఘాయిత్యం

హైదరాబాద్, అక్టోబర్ 18:హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఓ కీచకుడి అరాచకం వెలుగులోకి వచ్చింది. ఓ ప్రైవేట్ స్కూల్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఎల్‌కేజీ చదువుతున్న నాలుగేళ్ల చిన్నారిపై స్కూల్ ప్రిన్సిపల్ కారు డ్రైవర్ అఘాయిత్యానికి పాల్పడ్డట్టు ఆ బాలిక తల్లిదండ్రులు ఆరోపించారు. ఇవ్వాల (మంగళవారం) అతడిని పట్టుకుని మహిళలు చితకబాదారు. కాగా, గత రెండు నెలలుగా బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని, చాలా కాలంగా బాలిక ప్రవర్తనలో మార్పును గమనించామని తల్లిదండ్రులు చెబుతున్నారు. అయితే.. ఏ విషయంపై తమకేమీ చెప్పడం లేదని, బాలిక ప్రవర్తనలో మార్పును చూసి ఈ విషయాన్ని ఖరారు చేసుకున్నామని తెలిపారు.

కాగా, నిన్నటి నుంచి నీరసంగా ఉండడం, విపరీతంగా ఏడవడంతో అసలు విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బంజారాహిల్స్ పోలీసులకు కంప్లెయింట్ చేశారు. ప్రిన్సిపాల్ కారు డ్రైవర్ గా ఉన్న వ్యక్తి డిజిటల్ క్లాస్ రూమ్ లోకి వచ్చి చిన్న పిల్లలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు వారి ఫిర్యాదులో పేర్కొన్నారు. చాలా మంది పిల్లలు డ్రైవర్ రజినీకుమార్ ను చూసి భయపడుతున్నారని, అతని చేష్టల నుంచి పిల్లలను కాపాడాలని వారు కోరాఉ. డ్రైవర్ రజినికుమార్ ను కఠినంగా శిక్షించాలన్నారు.

## మహారాష్ట్రలో పెరుగుతున్న కరోనా కేసులు..!

ముంబయి, అక్టోబర్ 18: దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి అదుపులోనే ఉంది. గత కొన్ని రోజులుగా కొత్త కేసులు రెండు వేలకు సమీపంలోనే వెలుగు చూస్తున్నాయి. అయితే, మహారాష్ట్రలో మాత్రం గత వారంతో పోలిస్తే కేసులు సంఖ్య పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఇందుకు కారణం ఒమిక్రాన్ సబ్‌వేరియంట్ చీః అని భావిస్తున్నారు.

తాజాగా వెలుగులోకి వచ్చిన ఒమిక్రాన్ సబ్‌వేరియంట్ చీః వైద్య వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఃం.2.75, ఃఖ 1 రకాలు కలిపి చీః సబ్ వేరియంట్‌గా ఏర్పడినట్లు వైద్య నిపుణులు వెల్లడించారు. ఈ వేరియంట్‌ను ఇప్పటికే మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడులో గుర్తించినట్లు తెలిపారు. ఈ ఆగస్టులోనే సింగపూర్, యూఏఈలో చీః సబ్ వేరియంట్ వెలుగులోకి వచ్చింది. దీనికి ఃం.2.75 కంటే వేగంగా వ్యాప్తి చెందే లక్షణం, రోగనిరోధక శక్తిని ఏమార్చే గుణం ఉందని ఆరోగ్య శాఖ వెల్లడించింది.

సబ్‌వేరియంట్ కారణంగా మహారాష్ట్రలో గత వారంతో పోలిస్తే కొత్త కేసులు 17.7 శాతం మేర పెరిగాయి. చలికాలం, పండగల సీజన్ ఉండటంతో ఈ వేరియంట్ వ్యాప్తి ఎక్కువగా ఉండొచ్చని ఆరోగ్య నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం జనసాంద్రత ఎక్కువగా ఉన్న ఠాణె, రాయ్‌గఢ్, ముంబయిలో కేసులు పెరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించింది. జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉన్నవారు జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది.

## బిల్కిస్ బానోస్ నిందితుల విషయంలో బీజేపీ చర్యలు నీచాతినీచం: కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 18:బిల్కిస్ బానోస్ అత్యాచార నిందితులను కేంద్ర ప్రభుత్వమే విడుదల చేయించిందన్న వార్తలపై మంత్రి కేటీఆర్ స్పందించారు. ఇదొక షాకింగ్ విసయమన్న ఆయన.. బీజేపీ రాజకీయాలపై మండిపడ్డారు. "షాకింగ్.. ఇప్పటి వరకు గుజరాత్ ప్రభుత్వమే ఈ 'సంస్కారవంతులైన రేపిస్టులను' విడుదల చేసిందని వార్తలొచ్చాయి. తీరాచూస్తే కేంద్ర ప్రభుత్వమే దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందట. ఇది చాలా చవకబారు చర్య.

రేపిస్టులు, పసివాళ్లను చంపే దుర్మార్గులను కేవలం రాజకీయ లబ్ధి కోసం విడుదల చేయడం అనేది.. బీజేపీకి నీచమైన విలువలు ఉన్నా కూడా ఈ పని మాత్రం నీచాతినీచం" అని కేటీఆర్ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల్ అవుతోంది. నెటిజన్లు కేంద్ర ప్రభుత్వ విధానాలను తప్పుబడుతూ.. కేటీఆర్ మాటలతో ఏకీభవిస్తున్నారు.

## స్వచ్ఛ భారత్ 2022 కింద మెగా క్లీన్లినెస్ డ్రైవ్‌లను చాందినీ చౌక్ నుండి ప్రారంభించనున్న కేంద్ర మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ స్వచ్ఛ భారత్ 2022 కింద 19 అక్టోబర్ 2022న ఢిల్లీలోని చందానీ చౌక్ నుండి మెగా క్లీన్లీనెస్ డ్రైవ్‌లను ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇలాంటి క్లీన్లీనెస్ డ్రైవ్‌లు 19 అక్టోబర్ 2022న చేపట్టబడతాయి. స్వచ్ఛ భారత్ 2022 ప్రయత్నాలను డిపార్ట్‌మెంట్ ద్వారా ఏకీకృతం చేయడం దీని లక్ష్యం. యువజన వ్యవహారాలు మరియు దాని అనుబంధ సంస్థలైన ఎన్‌వైకెఎస్ మరియు ఎన్ఎస్ఎస్‌లు దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందిస్తున్నాయి.

మంచి ప్రారంభం గొప్ప మార్పుకు అలాగే పెద్ద పరివర్తనకు దారితీస్తుంది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ స్మారకార్థం యువజన వ్యవహారాల శాఖ ప్రారంభించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమం అందుకు నిదర్శనం.

17 రోజుల క్రితం ఒక నెల వ్యవధిలో కోటి కిలోల వ్యర్థాల సేకరణ లక్ష్యంతో కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా దేశంలోని అన్ని జిల్లాల నుండి యువత మరియు అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ఇప్పటి వరకు 60 లక్షల కి.గ్రా. వ్యర్థాలు సేకరించబడ్డాయి.

ఇది ఒక విధమైన ట్రెండ్ సెట్టర్. ప్రజలు ముఖ్యంగా యువత వారి నేపథ్యం మరియు అనుబంధాలతో సంబంధం లేకుండా కార్యక్రమంలో పాల్గొనడమే కాకుండా స్వచ్ఛంద ప్రాతిపదికన కార్యక్రమంలో చేరడానికి ఇతరులను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

స్వచ్ఛతా అభియాన్‌ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీజీ 2014లో ప్రారంభించారు. అప్పటి నుండి ఈ విషయంలో విశేషమైన పురోగతిని గమనించవచ్చు. ప్రధానమంత్రి నేతృత్వంలో కొనసాగుతున్న ఈ కార్యక్రమం కొత్త సంకల్పం, నిబద్ధతకు కొనసాగింపు.

యూత్ సెంట్రిక్ మోడల్‌తో స్వచ్ఛ్ భారత్ కార్యక్రమం విజువలైజేషన్, ప్రజలను సమీకరించడం మరియు కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో యువతకు ప్రధాన పాత్రను కల్పించింది. అభివృద్ధి దిశగా యువత కదలిక దేశానికి శుభసూచకం.

కార్యక్రమ ప్రధాన లక్ష్యం గ్రామం అయినప్పటికీ మత సంస్థలు, ఉపాధ్యాయులు, కార్పొరేట్ సంస్థలు, మహిళా సంఘాలు మరియు ఇతర జనాభాలోని నిర్దిష్ట విభాగాలు కూడా తమ సంఘీభావాన్ని తెలియజేయడానికి మరియు దానిని నిజమైన ప్రజా ఉద్యమంగా మార్చడానికి కార్యక్రమంలో పాల్గొంటున్నాయి.

చారిత్రక/ఐకానిక్ స్థానాలు మరియు పర్యాటక ప్రదేశాలు, బస్టాండ్/రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారి మరియు విద్యాసంస్థలు వంటి హాట్‌స్పాట్‌లలో కూడా ఇలాంటి డ్రైవ్‌లు చేపట్టబడుతున్నాయి.

ఈ కార్యక్రమ స్కేల్ మరియు ఔట్రీచ్ పరంగా రెండింటిలోనూ ప్రత్యేకమైనది మరియు యువ భగీదారి నుండి జన్ ఆందోళన్‌కు నమూనాగా దృశ్యమానం చేయబడింది. దీని ద్వారా కార్యక్రమ విజయం మరియు స్థిరత్వానికి ప్రతి పౌరుడి పాత్ర మరియు సహకారంతో రూపొందించబడింది.

స్వచ్ఛ భారత్ అనేది ఒక కార్యక్రమం మాత్రమే కాదు ఇది సామాన్యుల ఆందోళనలను మరియు సమస్యను పరిష్కరించడానికి వారి సంకల్పాన్ని ప్రతిబింబిస్తుంది.

ఈ కార్యక్రమ ముఖ్య అంశం ఏంటంటే అందరి వాటాదారుల మధ్య సమన్వయం మరియు సహకారం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించడం మరియు పరిశుభ్రతను నిర్ధారించడం అనే ఉమ్మడి లక్ష్యాన్ని సాకారం చేసుకోవడానికి వివిధ విభాగాలు/ఏజన్సీలు సిబిఓలు మరియు పౌర సమాజ సంస్థలు కలిసి వస్తున్నాయి.

అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ఎన్‌వైకెఎస్ మరియు ఎన్ఎస్ఎస్‌కు చెందిన లక్షలాది మంది యువ వాలంటీర్ల మద్దతు మరియు సహకారం లేనిదే ఈ స్వచ్ఛ్ భారత్ కార్యక్రమ ప్రయాణం సాధ్యపడేది కాదు. ఈ కార్యక్రమంలో లక్షలమంది కనిపించని యోధులు ఉన్నారు. ఈ డ్రైవ్‌లో వారే నిజమైన హీరోలు.




# బెల్లంపల్లిలో మెగా రక్తదాన శిబిరం.. 2360 యూనిట్ల రక్తం సేకరణ



కరీంనగర్, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ లోని బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మంగళవారం బెల్లంపల్లి గ్రౌండ్స్ లో జరిగిన ఈ మెగా రక్తదాన శిబిరాన్ని రామగుండం సీపీ చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. వేలాది మంది యువకులు తరలివచ్చి 2360 యూనిట్ల రక్తం దానం చేయడం విశేషం. కాగా, ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్? కమిషనర్? ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ.. రక్తదానం మహాదానమని, ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేస్తున్నదన్నారు. అమరవీరులు సమాజం కోసం, దేశం కోసం, రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం ప్రాణత్యాగాలు చేశారని వారి త్యాగాలను వెలకట్టలేమన్నారు.

ప్రతీ ఒక్కరూ అమరుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాలన్నారు సీపీ చంద్రశేఖర్?రెడ్డి. అమరుల త్యాగ ఫలంగానే ఈరోజు దేశం, రాష్ట్ర ప్రజలందరూ శాంతియుతంగా, ప్రశాంతంగా ఉన్నారన్నారు. పేద ప్రజలు, బాధితులకు సత్వర న్యాయం అందించడం, ధర్మం పక్షాన నిలిచి మెరుగైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేసినప్పుడే అమరుల త్యాగానికి నిజమైన నివాళి అని తెలిపారు. థలసేమియా, కేన్సర్, మెడికల్ ఎమర్జెన్సీ పేషంట్లు, బ్లడ్ కేన్సర్ రోగులు, హిమోఫీలియా, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి, తదితర జబ్బులతో బాధపడుతున్న వారి కోసం ఎక్కువగా రక్తం అవసరం ఉంటుందని, రక్త దానం చేయడం అనేది ఒక సామాజిక సేవా కార్యక్రమం అని, రక్తదానం మహాదానమని, రక్తదానంపై అపోహలు వద్దన్నారు.

ఆపదలో ఉన్న ప్రాణాలు రక్షించడానికి ఎంతో ఉపయోగపడుతుందని ఆరోగ్యంగా ఉండే ప్రతి మనిషి 6 నెలలకొకసారి రక్తదానం చేయాలని సూచించారు. పెద్ద ఎత్తున రక్త దానం శిబిరం ఏర్పాటు చేసిన బెల్లంపల్లి ఏసీపీ ఏడ్ల మహేష్, సబ్ డివిజన్ పోలీస్ అధికారులను అభినందించారు. అదేవిధంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన పోలీస్ సిబ్బంది, యువతకు ప్రజలందరికీ వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ బాబు రావు, బెల్లంపల్లి టౌన్ సీఐ రాజు, మందమర్రి సీఐ ప్రమోద్ రావు, తాండూర్ సీఐ జగదీష్, సబ్ డివిజన్ ఎస్ఐ లు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, సిబ్బంది, యువత, విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# దేశీ మిర్చికి ఆల్‌టైమ్ రికార్డు ధర.. క్వింటాల్‌కు రూ. 90 వేలు



వరంగల్,అక్టోబర్ 18:మిర్చి ధర బంగారాన్ని మించేసింది. ఆల్‌టైమ్ రికార్డు ధర పలికి మిర్చి రైతుల్లో ఎక్కడ లేని ఉత్సాహాన్ని నింపింది. క్వింటాలుకు ఏకంగా రూ. 90 వేలు పలికి.. రికార్డు నమోదు చేసుకుంది. వరంగల్ గ్రైయిన్ మార్కెట్ లో రైతులు తీసుకొచ్చిన దేశీ మిర్చి ఈ రికార్డు ధర పలికింది. మిగతా మిర్చికి మాములు రేట్లే రావటం గమనార్హం. మిర్చి ధర పైకి ఎగబాకుతూ.. లక్షకు చేరువలో ఉండడంతో మిర్చి రైతుల్లో ఎనలేని సంతోషం నెలకొంది.

# ట్రాఫిక్ కానిస్టేబుల్ పై గొడ్డలితో దాడి..

సంగారెడ్డి, అక్టోబర్ 18(నేటినిజం ప్రతినిధి):బైక్‌ను సీజ్ చేసిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన ఘటన తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో చోటుచేసుకుంది. ఈరోజు మధ్యాహ్నం 1.45 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో కానిస్టేబుల్ మహ్మద్ హఫీజ్ (49) తలకు బలమైన గాయం కావడంతో అతడిని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని తెలిసింది.ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేష్ యాదవ్ (51) ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, హైవే వంతెన వద్ద నర్సాపూర్ రోడ్డులో వాహన తనిఖీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే కానిస్టేబుల్ హఫీజ్ అతడి బైక్‌ను ఆపాడు. యాదవ్ తన వాహన పత్రాలను చూపించేందుకు నిరాకరించాడు. అతను మద్యం మత్తులో ఉన్నందున, హఫీజ్ అతడి బైక్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఇతర పోలీసు సిబ్బంది వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అరగంట తర్వాత యాదవ్ తిరిగి వచ్చి చేతిలో గొడ్డలితో వెనుక నుండి కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. బాటసారులు యాదవ్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించగా, హఫీజ్‌ను మొదట తూప్రాన్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు.






# సాధారణ ఎన్నికలు/ శాసనసభల ఉప ఎన్నికల కోసం కోవిడ్ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: మొదటి సమావేశం జరిగిన తేదీ నుంచి 5 సంవత్సరాల పాటు శాసన సభ పదవీకాలం ఉంటుందని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 172(1) పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్ శాసనసభ పదవీ కాలం 2023 జనవరి 8 నాటికి, గుజరాత్ శాసనసభ పదవీ కాలం 2023 ఫిబ్రవరి 18 నాటికి ముగుస్తుంది. భారత రాజ్యాంగం లోని 324 అధికరణం ని 171(1) తో కలిపి చదివినప్పుడు, ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 లోని సెక్షన్ 15 కింద పదవీ కాలం ముగిసే లోపు హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ శాసనసభలకు స్వేచ్ఛగా, న్యాయమైన, భాగస్వామ్య, ప్రాప్యత, సమ్మిళిత మరియు సురక్షితమైన ఎన్నికలు నిర్వహించడానికి భారత ఎన్నికల సంఘం ( ఇకపై ఈసీఐ గా ప్రస్తావించబడుతుంది) కట్టుబడి ఉంది.

–ఓటు మరియు ఓటర్లకు భద్రత కల్పిస్తూ చట్టపరమైన మరియు సంస్థాగత నిబంధనల ప్రకారం రాజ్యాంగ నిబంధనల మేరకు దఖలు పడ్డ అధికారాన్ని వినియోగించి నిర్ణీత వ్యవధిలో గా ఎన్నికైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంది.

– కోవిడ్ సమయంలో బీహార్, తమిళనాడు, కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల శాసనసభలకు సాధారణ ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం 2020 ఆగస్టు 21 న "ఊవిఐఆ–19 సమయంలో సాధారణ ఎన్నికలు/ఉప ఎన్నికల నిర్వహణకు విస్తృత మార్గదర్శకాలను" విడుదల చేసింది. ఆ తర్వాత గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరాఖండ్ మరియు ఉత్తర ప్రదేశ్ శాసనసభలకు జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భం పరిస్థితిని సమీక్షించి జనవరి 8, 2022న "సవరించిన మార్గదర్శకాలు 2022"ని ఎన్నికల సంఘం జారీ చేసింది. దీని ప్రకారం, ప్రచారం, ప్రదర్శనలు లాంటి అంశాలపై సంఘం ఆంక్షలు విధించింది. వీటిని 2022 జనవరి 15, 2022 జనవరి 22, 2022 జనవరి 31, 2022 ఫిబ్రవరి 6, 2022 ఫిబ్రవరి 12, 2022 ఫిబ్రవరి 22, 2022 మార్చి 10 న విడుదల చేసిన ప్రకటనల ద్వారా దశల వారీగా ఎన్నికల సంఘం సడలించింది.

–2022 సెప్టెంబర్ 7న కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శితో, 2022 సెప్టెంబర్ 13 న గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శి (హోం) ప్రధాన ఎన్నికల అధికారులతో కోవిడ్ తాజా పరిస్థితిపై ఎన్నికల సంఘం సమావేశం సమీక్షించింది. కోవిడ్ తాజా పరిస్థితి, టీకా కార్యక్రమం స్థాయి, ప్రస్తుతం అమలులో ఉన్న ఎస్డీఎంఏ మార్గదర్శకాలు, రానున్న పండుగల కాలంలో కోవిడ్ జాగ్రత్తలు తదితర అంశాలపై చర్చలు జరిగాయి. దేశంలో పరిస్థితులు మెరుగుపడ్డాయని, కేసుల సంఖ్య పెరిగితే పరిస్థితిని ఎదుర్కోవడానికి తీసుకుంటున్న చర్యలు, కోవిడ్ నియంత్రణ చర్యల కోసం డీఎం చట్టం లోని చర్యలు అమలు చేయవలసిన అవసరం లేదని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ తీసుకున్న నిర్ణయాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకు రావడం జరిగింది.

–కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన సూచనలు ముఖ్యంగా టెస్ట్, ట్రాక్, ట్రీట్, వ్యాక్సినేషన్ మరియు కోవిడ్ సముచిత ప్రవర్తన విధానాన్ని ఖచ్చితంగా పాటించాలని మరియు కొనసాగించాలని గుజరాత్ మరియు హిమాచల్ ప్రదేశ్ ముఖ్య కార్యదర్శులు మరియు ఇతర అధికారులను సంఘం ఆదేశించింది. అర్హులైన పోలింగ్ సిబ్బంది, అధికారులందరికీ టీకాలు వేయాలని కమిషన్ సూచించింది. అంతేకాకుండా, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మరియు/లేదా సంబంధిత రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ లు సూచించిన మార్గదర్శకాల ప్రకారం కఠినమైన నిఘా ఉంచాలని మరియు రాబోయే పండుగ సీజన్‌లు, ఎన్నికల సమయంలో కోవిడ్ పరిస్థితికి సంబంధించిన అవాంఛనీయ పరిస్థితి తలెత్తిన సమయంలో మార్గదర్శకాల అమలులో పరిస్థితికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రెండు రాష్ట్రాల అధికారులను ఎన్నికల సంఘం ఆదేశించింది.

–ఎన్నికల ప్రక్రియలో రాష్ట్ర స్థాయిలో ప్రధాన కార్యదర్శి మరియు జిల్లా స్థాయిలో జిల్లా మేజిస్ట్రేట్, కమిషన్ జారీ చేసిన ఈ కోవిడ్ మార్గదర్శకాలను పరిస్థితికి తగినట్టుగా రూపొందించడం , పర్యవేక్షించడం మరియు అమలు చేయడం కోసం ప్రాథమికంగా బాధ్యత వహిస్తారు.

– రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రచారకర్తలు, ఓటర్లు మరియు ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమైన అన్ని వర్గాలు ప్రజారోగ్యం / భద్రత తమ ప్రధాన కర్తవ్యంగా భావించి కోవిడ్ అనుగుణ ప్రవర్తనను పాటించాలి.

–మార్గదర్శకాల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:

ఎ. ఎన్నికల ప్రక్రియ సమయంలో ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన సాధారణ మార్గదర్శకాలు

– ఎన్నికల సంబంధిత కార్యకలాపాల సమయంలో పాల్గొన్న వ్యక్తులందరూ కోవిడ్ అనుగుణ ప్రవర్తన అనుసరించాలని సూచించడం జరిగింది.

–అర్హత గల పోలింగ్ సిబ్బంది/సెక్యూరిటీ సిబ్బంది/కౌంటింగ్ సిబ్బంది ఎన్నికల సంబంధిత కార్యకలాపాల్లో నియమించే ముందు /పని ప్రారంభించే ముందు పూర్తిగా మరియు ప్రాధాన్యంగా బూస్టర్ మోతాదు టీకాలు వేయాలి.

–స్వీయ పర్యవేక్షణ తో సహా కోవిడ్ అనుగుణం ప్రవర్తనపై ప్రజల్లో అవగాహన కల్పించాలి.

### రాజకీయ పార్టీలు/పోటీ చేసే అభ్యర్థులు/ఇతరుల ప్రచారం

– అవుట్‌డోర్ మీటింగ్/ఇండోర్ మీటింగ్‌లు/ర్యాలీలు/రోడ్ షోలు/పాద యాత్రలు / ఊరేగింపు సమయంలో, నిర్వాహకులు మరియు సంబంధిత రాజకీయ పార్టీ అధికారం కలిగిన అధికారులు జారీ చేసే మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలి. కార్యక్రమంలో పాల్గొనే వ్యక్తులు సూచించిన కోవిడ్ అనుగుణ ప్రవర్తనను పాటించాలి. కోవిడ్ సంబంధిత నిబంధనలు మరియు మార్గదర్శకాలు ఉల్లంఘిస్తే నిర్వాహకులు బాధ్యత వహించాలి.

– రాజకీయ పార్టీలు/అభ్యర్థులు తమ సమావేశాలు మరియు ప్రదర్శనలు , రోడ్ షో, పాదయాత్ర మరియు ఊరేగింపు, ఇంటింటికి ప్రచారం మొదలైనవాటిని సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకుని ఈ విషయంలో ఎన్నికల సంఘం జారీచేసే సూచనలకు లోబడి నిర్వహించవచ్చు.

– ఇప్పటికే కమిషన్ సూచించిన పద్ధతిలో సువిధ యాప్‌ని ఉపయోగించి పబ్లిక్ స్థలాల కేటాయింపు చేయాలి.

### పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు–

–ప్రతి పోలింగ్ కేంద్రంలో కల్పించవలసిన కనీస సౌకర్యాలపై ఎన్నికల సంఘం ఇప్పటికే వివరణాత్మక సూచనలను జారీ చేసింది. కోవిడ్‌ని దృష్టిలో ఉంచుకుని, అవసరమైన విధంగా కింది అదనపు సౌకర్యాలు/చర్యలు తీసుకోవచ్చు:

– క్యూ లో వేచి ఉండకుండా చూసేందుకు ముందు వచ్చిన ఓటర్ కి ముందుగా టోకెన్ పంపిణీ చేయడానికి హెల్ప్ డెస్క్.

–క్యూ కోసం సామాజిక దూరాన్ని ప్రదర్శించడానికి గుర్తులు .

– కోవిడ్ నిబంధనల ప్రకారం సంబంధిత అధికారి జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం,స్థల లభ్యతను బట్టి క్యూలో నిలబడిన ఓటర్ల మధ్య సామాజిక దూరం నిర్వహించబడుతుంది. పురుషులు, స్త్రీలు మరియు వికలాంగులు/ సీనియర్ సిటిజన్ ఓటర్ల కోసం ఒక్కొక్కటి మూడు క్యూలు ఉంటాయి.

– సంబంధిత అధికారి సూచించిన సామాజిక దూర నిబంధనలను పర్యవేక్షించడానికి మరియు నియంత్రించడానికి బిఎల్ఓ,వాలంటీర్లు మొదలైన వారి సేవలు ఉపయోగించవచ్చు.

– పోలింగ్ స్టేషన్ ప్రాంగణంలో మగ మరియు ఆడవారికి వేర్వేరుగా కుర్చీలు, డేరాలు మొదలైనవాటితో వెయిటింగ్ ఏరియా ఏర్పాటు చేయాలి. తద్వారా ఓటర్లు భద్రతాపరమైన సమస్యలు లేకుండా ఓటింగ్‌లో పాల్గొనవచ్చు.

– సాధ్యమైన చోట, బూత్ యాప్‌ను పోలింగ్ స్టేషన్‌లో ఉపయోగించవచ్చు.

–కోవిడ్‌పై అవగాహన పోస్టర్‌లను సమర్థ అధికారం సూచించిన నిబంధనల ప్రకారం కనిపించే ప్రదేశాలలో ప్రదర్శించాలి.

–కోవిడ్ –19 సంబంధిత నివారణ చర్యలను ఖచ్చితంగా పాటిస్తూ, ఆరోగ్య అధికారుల పర్యవేక్షణలో, కోవిడ్ పేషెంట్లు మరియు క్వారంటైన్‌లో ఉన్న ఇతర వ్యక్తులందరూ పోలింగ్ రోజు చివరి గంటలో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి అనుమతించబడతారు. సెక్టార్ మేజిస్ట్రేట్‌లు తమకు కేటాయించిన పోలింగ్కేంద్రాల్లో ఈ కార్యాచరణను సమన్వయం చేస్తారు.

### పోస్టల్ బ్యాలెట్

కోవిడ్ పాజిటివ్/అనుమానిత మరియు క్వారంటైన్‌లో ఉన్న (ఇల్లు/ సంస్థాగత) ఓటర్లకు కూడా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ఎంపిక కల్పించబడింది.

వి .) ఓట్ల లెక్కింపు

–30 ఏప్రిల్ 2014 నాటి కమిషన్ ప్రస్తుత సూచనల ప్రకారం ఒక నియోజకవర్గం యొక్క ఓట్ల లెక్కింపు కోసం గరిష్టంగా 15 కౌంటింగ్ టేబుల్‌లు (ఆర్వో టేబుల్‌తో సహా) ఉండాలి .

– కౌంటింగ్ ప్రక్రియలో జరుగుతున్న సమయంలో కౌంటింగ్ వేదిక వెలుపల ప్రజలు గుమి కూడదానికి అనుమతించరాదు.

– కోవిడ్ నివేదిక సానుకూలంగా ఉన్నట్లయితే అభ్యర్థి కౌంటింగ్ ఏజెంట్లను నియమించవచ్చు/మరొకరిని నియమించవచ్చు.

కోవిడ్ మార్గదర్శకాల్లో పొందుపరచని అంశాలు ఏర్పడినప్పుడు ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఎన్నికల సమయంలో ఎదురైనప్పుడు సంబంధిత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదరు అంశాలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకు రావాల్సి ఉంటుంది. దీని ఆధారంగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం తదుపరి తగిన సూచనలను జారీ చేసి కోవిడ్ వ్యాప్తిని నియంత్రించడంలో/ నిర్వహించడంలో రాష్ట్రం అమలు చేస్తున్న సూచనలు/ ప్రయత్నాల అమలుకు సహకరిస్తుంది.

# "అభ్యాస నష్టాలు: పిల్లలు, యువత మరియు భవిష్యత్తు ఉత్పాదకతపై కోవిడ్ పెనుభారం గురించి ఏమి చేయాలి" అనే అంశంపై వాషింగ్టన్ డీ సీ లో ప్రపంచ బ్యాంకు డెవలప్‌మెంట్ కమిటీ డిన్నర్ సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:కేంద్ర ఆర్థిక ఓ కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి.నిర్మలా సీతారామన్ ప్రపంచ బ్యాంక్ వార్షిక సమావేశాలు 2022 సందర్భంగా నిన్న సాయంత్రం వాషింగ్టన్ డీ సీ అభివృద్ధి కమిటీ విందు సమావేశంలో "అభ్యాస నష్టాలు: పిల్లలు, యువత మరియు భవిష్యత్తు ఉత్పాదకతపై కోవిడ్ పెనుభారం గురించి ఏమి చేయాలి" అనే అంశంపై జరిగిన చర్చలో పాల్గొన్నారు.

కోవిడ్ 19 నేపథ్యంలో పాఠశాలలు మూసివేత విద్యాభ్యాస పునరుద్ధరణ మరియు నైపుణ్యం మెరుగుదలపై ఎడతెగని దృష్టి తప్పనిసరి అని పాల్గొనే ప్రతి దేశం అంగీకరిస్తుందని ఆర్థిక మంత్రి తన ప్రారంభ వ్యాఖ్యలలో తెలిపారు.

భారతదేశ ప్రత్యేక అనుభవాన్ని పంచుకుంటూ, శ్రీమతి. నిర్మలా సీతారామన్ కోవిడ్ 19 మహమ్మారి ప్రభావంతో జరిగిన విద్యాభ్యాస నష్టంపై భారతదేశం చేపట్టిన రెండు దశలను సీతారామన్ పంచుకున్నారు:

భారతదేశం 3.4 మిలియన్ల ఎఎఎ, ఎ, ఎఎఎ మరియు చీ తరగతుల విద్యార్థుల అభ్యసించే సామర్థ్యాలను అంచనా వేయడానికి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఔఆ)ని నవంబర్ 2021లో నిర్వహించింది. పోల్చదగిన గ్రేడ్‌ల కోసం ఎన్ ఏ ఎస్ 2017తో పోలిస్తే జాతీయ సగటు పనితీరు 9%కి పడిపోయిందని ఇది చూపించింది.

మార్చి 2022లో, భారతదేశం గ్రేడ్ ఎఎఎ విద్యార్థుల కోసం నేషనల్ ఫౌండేషన్ లెర్నింగ్ స్టడీని చేపట్టింది. ఇది మొదటిసారి వ్యక్తిగత విద్యాభ్యాస ప్రమాణాలను సంఖ్యా మరియు గ్రహణ ప్రమాణాలు భారతదేశంలో బోధనా మాధ్యమంగా ఉపయోగించే 20 భాషలలో ప్రపంచ ప్రావీణ్యం ఫ్రేమ్‌వర్క్ ఆధారంగా అంచనా వేయడానికి ప్రపంచంలోనే నిర్వహించిన అతిపెద్ద నమూనా అధ్యయనం. ఈ రెండు ప్రయత్నాలు సమస్య యొక్క పరిమాణాన్ని ప్రామాణికంగా అంచనా వేయడమే కాకుండా వ్యవస్థాగత ప్రయత్నాలు సాక్ష్యం–ఆధారిత ప్రణాళికను కూడా అందజేస్తాయని ఆర్థిక మంత్రి ఉద్ఘాటించారు. ఆర్థిక మంత్రి ఈ ఉదాహరణలను ప్రపంచ బ్యాంకుతో పంచుకున్నారు, తద్వారా వారు ఈ అనుభవాన్ని ఇతర దేశాలతో పంచుకోవచ్చు.

భారతదేశం యొక్క 12 డిజిటల్ గ్లోబల్ గూడ్స్‌లో ఒకటిగా గుర్తించబడిన భారతదేశ డిజిటల్ ప్లాట్‌ఫామ్, దీక్షా ఇప్పుడు పబ్లిక్ డొమైన్‌లో ఉందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. శ్రీమతి. సీతారామన్ మాట్లాడుతూ, ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రాథమిక పాఠశాల పిల్లలకు క్యూ ఆర్ కోడ్ పాఠ్యపుస్తకాలను గత సంవత్సరం లోనే అందించి ప్రపంచంలోనే భారతదేశం మొదటి దేశంగా అవతరించింది. ఆర్థిక మంత్రి ఆసక్తిగల అన్ని దేశాలకు దీక్ష డిజిటల్ ప్లాట్‌ఫామ్ కూడా అందుబాటులో ఉంటుంది అని మరియు ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ విద్యను విస్తరించడానికి ప్రపంచ బ్యాంక్ ఈ అవకాశాన్ని పరిగణించవచ్చని పేర్కొన్నారు.

5 సంవత్సరాల పాటు అత్యంత భాగస్వామ్య స్ఫూర్తి తో మరియు బహుముఖ సంప్రదింపుల ఆధారంగా భారతదేశం జాతీయ విద్యా విధానం ముసాయిదాను రూపొందించి అప్లోడ్ చేసిందని ఆర్థిక మంత్రి తెలిపారు. విద్యపై మహమ్మారి ప్రభావం గురించిన అనుభవం ఆధారం గా కొత్త జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్‌వర్క్ పాలసీ జూలై 2020లో విడుదలయింది.

ఇటువంటి అత్యంత భాగస్వామ్య సంప్రదింపుల ప్రక్రియ నాణ్యమైన అభ్యాసం, పునాది నైపుణ్యాల అవసరం, బోధన మరియు అభ్యాస వనరుల యొక్క మెరుగైన నాణ్యత మరియు ప్రతి అభ్యాసకుడికి విద్యార్థికి నైపుణ్యం ఆధారిత విద్య ప్రక్రియతో అందరికీ పాలసీ పై ఆసక్తి పెరిగిందని శ్రీమతి సీతారామన్ అన్నారు. వాలంటీర్లను నేరుగా వారికి నచ్చిన పాఠశాలలతో అనుసంధానం చేయడానికి మరియు విద్యాభ్యాసం త్వరగా కోలుకోవటాన్ని వేగవంతం చేయడంలో సహాయపడటానికి భారతదేశం ఇటీవల విద్యాంజలి 2.0 ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ను ప్రారంభించింది.

పునాది నైపుణ్యాలను పెంపొందించడం కోసం సాంకేతికత ఆధారిత పరిష్కార కార్యక్రమాన్ని అమలు చేయడంలో సహాయపడే భారతదేశ గోల్ ప్రోగ్రామ్ గురించి సంబంధించిన పేపర్‌లో ప్రస్తావించినందుకు శ్రీమతి సీతారామన్ హర్షం వ్యక్తం చేశారు.

పిల్లల వయస్సు లేదా గ్రేడ్ కాకుండా అభ్యసన అవసరాల ఆధారంగా బోధనా సమూహాలుగా విభజించబడిన భారతదేశం యొక్క "సరైన స్థాయిలో బోధించు" చొరవను కూడా పేపర్‌లో ప్రస్తావించినట్లు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

సిలబస్ ఆధారిత అభ్యాస ఫలితాలను విడుదల చేసే వారం వారీ ప్రణాళికతో కూడిన ప్రత్యామ్నాయ విద్యా క్యాలెండర్‌ను భారతదేశం కూడా ప్రవేశపెట్టిందని శ్రీమతి.సీతారామన్ ప్రతినిధులకు తెలియజేశారు. అదేవిధంగా, ఉపాధ్యాయులను సన్నద్ధం చేయడానికి భారతదేశం ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిష్ఠ (జాతీయ ఇనిషియేటివ్ ఫర్ స్కూల్ హెడ్స్ అండ్ టీచర్స్ ఫర్ హోలిస్టిక్ అడ్వాన్స్‌మెంట్) ప్రారంభించింది.

తక్కువ ఉత్పాదకత, ఆదాయాలు మరియు పెరిగిన సామాజిక అశాంతి కారణంగా భవిష్యత్తులో కోల్పోయే తరం, సంచిత భవిష్యత్ ఆర్థిక నష్టాలను నివారించడానికి దేశాలు విద్యాభ్యాస నష్ట నివారణ త్వరగా కోలుకొనే ఆచరణ ప్రణాళిక (లెర్నింగ్ లాస్ రికవరీ యాక్షన్ ప్లాన్) ను రూపొందించడంలో సహాయపడటానికి ప్రపంచ బ్యాంక్ తన విజ్ఞాన శక్తిని ఉపయోగించాలని శ్రీమతి.సీతారామన్ ఉద్బోధించారు.

# ఎన్నికల గుర్తులపై టీఆర్ఎస్ పిటిషన్ కొట్టివేత

వరంగల్,అక్టోబర్ 18: మునుగోడు ఉప ఎన్నికల నేపథ్యంలో కారు గుర్తును పోలి ఎనిమిది గుర్తులున్నాయని, దాని వలన తాము ఓట్లను నష్టపోతున్నామని టీఆర్ఎస్ ఆరోపిస్తుంది. ఆ గుర్తులను ఎవరికీ కేటాయించవద్దని, వాటిని తొలగించాలని న్యాయస్థానాన్ని కోరిన విషయం తెలిసిందే.అయితే ఎన్నికల గుర్తులపై టీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. తమ పార్టీ గుర్తు కారును పోలిన గుర్తును ఇతర అభ్యర్థులకు కేటాయించవద్దంటూ వేసిన పిటిషన్ ను న్యాయస్థానం డిస్మిస్ చేసింది. మునుగోడులో స్వతంత్ర అభ్యర్థులకు ఇప్పటికే గుర్తులు కేటాయించామని ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. ఈ సమయంలో పిటిషన్ పై జోక్యం చేసుకోలేమని న్యాయస్థానం పేర్కొంది.

# రాజన్నను దర్శించుకున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

## స్వాగతం పలికిన అధికారులు, అర్చకులు.. కోడె మొక్కు చెల్లించి.. ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ, ఐపీఎస్ అధికారి సజ్జనార్ సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన ఎండీ దంపతులకు ఎస్పీ రాహుల్ హెగ్డే, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్ర చారిలు పూల మొక్కలను అందించి స్వాగతం పలికినారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలకగా, అర్చకులు వేదమంత్రోచ్చరణలతో ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారి ప్రత్యేక పూజలు చేసి, కోడె మొక్కు చెల్లించుకున్నారు. అలాగే కళ్యాణ మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి శేషవస్త్రం కప్పి అద్దుప్రసాదం అందజేశారు. అనంతరం స్వామి వారి నిత్య కల్యాణంలోనూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దంపతులు పాల్గొన్నారు.

# మునుగోడు అభివృద్ధి టీఆర్ఎస్ తోనే సాధ్యం : మంత్రి ఎర్రబెల్లి



నల్లగొండ, అక్టోబర్ 18: మునుగోడు నియోజకవర్గం ఉప ఎన్నికలో భాగంగా చండూరు 2వ, 3వ వార్డులలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇంటింటి ప్రచారం చేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. బీజేపీని ఈ ఉప ఎన్నికలో ఓడించాలి.. మునుగోడులో గతంలో టీఆర్ ఎస్ ఆదరించక పోయినా కేసీఆర్ ఇక్కడ అన్ని పథకాలను అందించి అభివృద్ధి చేశారన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే, మునుగోడు టీఆర్ఎస్ గెలవాలన్నారు. బీజేపీ కావాలని ఈ ఎన్నికలు తెచ్చిందని, వేల కోట్లకు అమ్ముడు పోయిన కొందరి స్వార్థంతో ఈ ఎన్నిక వచ్చిందన్నారు. అలాంటి వాళ్లకు, అవకాశ వాదులకు తగిన బుద్ధి చెప్పే అవకాశం ఇప్పుడు ప్రజలకు వచ్చిందన్నారు. ప్రజలు బాగా ఆలోచించి తమ ఓటు హక్కు ను వినియోగించుకోవాలని సూచించారు.

సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి దేశంలోనే ఎవరూ చేయలేదన్నారు. రాష్ట్రాన్ని, మన గ్రామాలను దేశానికి ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్ దే అన్నారు. మన నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే, మన నాయకులు, మనకు ప్రతినిధులుగా ఉండాలన్నారు. పేదలకు రేషన్ కార్డులు, ఇండ్లు, పెన్షన్లు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలతో ఎంతో అభివృద్ధి చేశారు. మిషన్ భగీరథతో మునుగోడులో ఫ్లోరైడ్ లేకుండా చేసిన ఘనత ఎవరిదో మీకు తెలుసు అన్నారు. ఇంతకాలం ఏలిన నాయకులకు ఈ సోయి వచ్చిందా?, అలాంటి పార్టీలు, నాయకులు మనకు అవసరమా?.. అందుకే అలాంటి పార్టీలను ఈ ఎన్నికలో బొంద పెట్టాలన్నారు. టీఆర్ఎస్ పార్టీ కి పట్టం కట్టాలి, సారు, కారు తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం అని మంత్రి ఎర్రబెల్లి అన్నారు.

# అప్పు ఇచ్చినోడి ఇంటికే కన్నం.. ముగ్గురు అరెస్ట్..

వరంగల్,అక్టోబర్ 18: తమ అవసరాలకు డబ్బు అప్పుగా ఇచ్చిన వ్యక్తి ఇంటిలోనే చోరీకి పాల్పడిన ముగ్గురు దొంగలను సీసీఎస్, మీ కాలనీ పోలీసులు సంయుక్తంగా కల్సి అరెస్ట్ చేశారు. వీరి నుండి సుమారు మూడు లక్షల అరువై వేల రూపాయల విలువగల 65 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు అరకిలో వెండి, మూడు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్ట్ సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ డా.తరుణ్ జోషి వివరాలను వెల్లడిస్తూ వరంగల్ కరీమాబాద్ కు చెందిన ఉరుగొండ శ్రీకాంత్ (35), కాశీబుగ్గ ప్రాంతానికి దేవుల పల్లి రవీందర్ (40), కుడికాల్ల సురేష్ (36) వీరిలో శ్రీకాంత్ సెల్ ఫోన్ కంపెనీలో కలెక్షన్ బాయ్ గా పని చేస్తుండగా, మిగితా ఇద్దరు నిందితులు స్థానికంగా ఉండే ప్రింటింగ్ ప్రెస్ లో పని చేస్తారు. ఈ ముగ్గురు నిందితుల్లో శ్రీకాంత్, రవీందర్ ఇరువురు బావమరదులు కాగా మూడవ నిందితుడు సురేష్ ఈ ఇద్దరికి స్నేహితుడు. ఈ ముగ్గురు నిందితులు పనులను ముగించుకొని అనంతరం కల్సి మద్యం సేవిస్తూ జల్సాలు చేసేవారు. నిందితులు మీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని దయానందకాలనీలో ఒంటరిగా నివాసం ఉంటున్న బాధితుడితో పరిచయం చేసుకున్నారు. నిందితులు మద్యం సేవించేందుకుగాను బాధితుడి వద్ద డబ్బులు అప్పుగా తీసుకోవడంతో పాటు తమతో పాటు బాధితుడికి అతని ఇంటిలోనే మద్యం తాగిస్తూ నిందితులు మద్యం సేవించేవారు. ఇదే క్రమంలో బాధితుడు నిందితులకు తన ఇంటిలోని బీరువా నుండి డబ్బు ఇచ్చే సమయంలో నిందితులకు బీరువాలోని బంగారు, వెండి వస్తువులపై కన్ను పడటంతో వాటిని చోరీ చేసి సులభంగా డబ్బు సంపాదించాలకున్నారు. ఇందులో భాగంగా నిందితులు ప్రణాళిక ప్రకారం బాధితుడుకి బయట ప్రదేశాల్లో మద్యం త్రాగించి మద్యం మత్తులో వున్న బాధితుడిని ఇంటికి తీసువచ్చి దించి పోయే క్రమంలో నిందితులు ఇంట్లో వున్న బీరువా తాళంచెవితో బీరువాలోని బంగారు, వెండి డబ్బును దఫాలవారిగా చోరీ చేసారు.

బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు అదనపు డిసిపి పుష్పా ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించడం జరిగింది. ఈ రోజు ఉదయం నిందితులు ముగ్గురు చోరీ చేసిన సొత్తును వరంగల్ బిలియన్ మార్కెట్ లో అమ్మేందుకుగాను వెంకట్రామ టాకీస్ జంక్షన్ వద్ద ఉన్నట్లుగా పోలీసులకు సమాచారం రావడంతో సిసిఎస్, మిల్స్ కాలనీ పోలీసులు సంయుక్తంగా కల్సి వెళ్ళి నిందితులను అదుపులోని తీసుకోని తనీఖీ నిందితుల వద్ద చోరీ సొత్తును గుర్తించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకోని విచారించగా నిందితులు పాల్పడిన చోరీని పోలీసుల ముందు అంగీకరించారని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కంత్రీగాళ్ళను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన క్రైమ్స్ అండ్ ఆపరేషన్స్ అదనపు డిసిపి పుష్పా, క్రైమ్స్ ఏసిపి డేవిడ్ రాజు, సిసిఎస్ ఇన్ స్పెక్టర్లు రమేష్ కుమార్, శ్రీనివాస్ రావు, మీ కాలనీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సిసిఎస్ ఎస్.ఐ సంపత్ కుమార్, ఏఎస్ఐ శివకుమార్, హెడ్ కానిస్టేబుళ్ళు అంజయ్య,వేణుగోపాల్, షర్పుద్దీన్, జంపయ్య, కానిస్టేబుల్ నజీరుద్దీన్ పోలీస్ కమిషనర్ అభినందించి రివార్డులను అందజేశారు. ఈ కార్యక్రమములో పరిపాలన విభాగం అదనపు డిసిపి వైభవ్ గైక్వాడ్ పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో వేములవాడ పట్టణ మున్సిపల్ కమిషనర్

## -రూ. 30 వేలు తీసుకుంటూ పట్టివేత

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ డిఎస్పీ భద్రయ్య నేతృత్వంలో దాడులు నిర్వహించి 30 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఉండగా వేములవాడ మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్రావును పట్టుకున్నారు. చామకుంటలో నిర్మిస్తున్న వెజిటేబుల్ మార్కెట్ బిల్డింగ్ నిర్మాణ వర్క కాంట్రాక్ట్ పొడిగించే విషయంలోకాంట్రాక్టర్ ను కమిషనర్ డబ్బులు డిమాండ్ చేయగా సదరు కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. కాంట్రాక్టర్ నుండి కమిషనర్ రూ. 30 వేలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. కెమికల్ టెస్టులు పూర్తిచేసి వాంగ్మూలాన్న ఏ సీ బీఅధికారులు తీసుకున్నారు .

# వరంగల్ లో భారీ వర్షం.. మార్కెట్ లో తడిసిన పత్తి..



వరంగల్,అక్టోబర్ 18:వరంగల్ లో భారీ వర్షం కురిసింది. స్థానిక వ్యవసాయ మార్కెట్ లో పత్తి తడిసి ముద్దయ్యింది. కొనుగోళ్ళకు ఖరీదుదారులు విముఖత చూపుతున్నారు.

పత్తి ధర తగ్గించే కుట్రలు జరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కాటన్ కొనుగోళ్లు ప్రారంభించాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే తడిసిన పత్తిని ఖరీదు చేయలేమని వ్యాపారులు తేల్చి చెబుతున్నారు. దీంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులుఏ పట్టించుకోకపోవడంతో రైతులు నిరసనకు దిగేందుకు సిద్ధమవుతున్నారు.

# రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో శ్రీ చైతన్య కు బంగారు, కాంస్య పథకాలు







రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి): హైద్రాబాద్ లో లో ఈ నెల 16 న ఒకిన వామార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటేఛాంపియన్ షిప్ పోటీలలో వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన ఇద్దరు విధ్యార్థులు బంగారు, కాంస్య పథకాలు సాధించారని శ్రీ చైతన్య ప్రధానోపాద్యారాలు సుదే ష్ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కటా,స్పారింగ్ బాలుర విభాగంలో 3 తరగతి చదువుతున్న సిహిచ్ సూర్య జయ్ చందర్ 2 బంగారు పథకలు కటా,స్పారింగ్ బాలుర విభాగంలో 3 తరగతి చదువుతున్న ఆర్య నంద్ పథకం సాధించగా విద్యార్థులను శ్రీ చైతన్య పాఠశాలల ఛైర్మన్ శ్రీధర్ , డైరక్టర్ శ్రీవిద్య , డీజీఎం లక్ష్మణ్ రావు , రీజినల్ ఇన్చార్జ ముద్రకోల రాజు, ప్రిన్సిపల్ సుదేష్ కుమారిఅభినందించారు .ఈ కార్యక్రమంలో డీ న్ శేఖర్ ,ప్రైమరీ ఇంఛార్జ్ లు సృజన , మమత , ఏవో సుధీర్ , పి టి సుధాకర్ తల్లిదండ్రులు ఉన్నారు .

# బీ(టీ)ఆర్ఎస్ కు వేల్పూరు రైతుల భారీ విరాళం



నిజామాబాద్, అక్టోబర్ 18:తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్కు వెన్నుదన్నుగా నిలిచిన వేల్పూరు మండల రైతులు ..ఇప్పుడు బీఆర్ఎస్కు అండగా నిలుస్తున్నారు. బీ(టీ) ఆర్ఎస్కు మద్దతు తెలియజేస్తూ స్వచ్ఛందంగా రూ.లక్షా 50వేల 116ను విరాళం అందజేసి ఆదర్శంగా నిలిచారు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సొంత మండల కేంద్రమైన వేల్పూరు రైతులు.

తెలంగాణ రైతుల లెక్కనే దేశం అంతటా రైతులు సంబురంగా ఉండాలంటే కేసీఆర్ ప్రధాని కావాలని కాంక్షించిన రైతులు, మంత్రి వేముల తండ్రి స్వర్గీయ వేముల సురేందర్ రెడ్డి రైతులకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఈ సందర్భంగా భారత రాష్ట్ర సమితి కి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు విరాళాలు అందించి మద్దతు పలికారు.

కేసీఆర్ వచ్చిన తర్వాతనే తెలంగాణలో రైతు గోసలు పోయాయని పేర్కొన్నారు. రైతు బంధు, రైతు బీమా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్,పుష్కలంగా సాగు నీరు అందించి రైతును రాజుగా చేశాడని కొనియాడారు.

పెట్టుబడి సాయం ఇవ్వడమే కాకుండా రైతు పండించిన ధాన్యాన్ని కూడా కొంటున్న ఘనత కేసిఆర్ కే దక్కిందన్నారు.

మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి బాల్కొండ లో చెక్ డ్యాంలు నిర్మించి రైతుల సాగునీటి సమస్యలు తీర్చారని పేర్కొన్నారు.

బిఆర్ఎస్కు స్వచ్ఛందంగా విరాళాలు అందించి మద్దతు పలికిన వేల్పూర్ మండల రైతులకు రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులు, పేదలు కష్టాలను పరిష్కరించడమే కేసీఆర్ పాలన ఉంటుందని పునరుద్ఘాటించారు.

# ఏటూరునాగారంలో రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాలు ప్రారంభం



ఏటూరునాగారం, అక్టోబర్ 18: పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే జీవితంలో సక్సెస్ అవుతారని గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిష్టినా జడ్ చొంగ్తూ అన్నారు. స్థానిక ఐటీడీఏ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడోత్సవాలను మంగళవారం ఏటూరునాగారం కొమురంభీం స్టేడియంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ క్రీడలు కెరీర్లో పునాదుల్లా ఉపయోగపడుతాయని శారీరక, మానసికంగా ధృఢంగా ఉండి క్రమ శిక్షణను పాటిస్తే విజయం సాధించడంతో పాటు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు.

ఆత్మస్థైర్యంతో క్రీడల్లో పాల్గొని గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమేనని, నిజాయితీగా ఆడడం అలవర్చుకోవాలని సూచించారు. మూడు రోజుల పాటు జరిగే క్రీడల్లో ఉట్నూరు, భద్రాచలం, మైదాన ప్రాంతానికి చెందిన గిరిజన ఆశ్రమ పాఠశాలల నుంచి 1464 మంది క్రీడాకారులు, 168 మంది ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, అధికారులు పాల్గొంటున్నారు. ఈ క్రీడల్లో ఆరు జోన్ల నుంచి క్రీడాకారులు పాల్గొంటుండగా ఒక్కో జోన్ నుంచి ఒక్కో క్రీడలో 14,17 సంవత్సరాల బాల, బాలికలు రెండేసీ టీంలుగా పాల్గొంటున్నాయి.

వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, టెన్నికాయిట్, అర్చరీ, అథ్లెటిక్స్??, చెస్, క్యారమ్స్? పోటీలు జరుగనున్నాయి. ఏటూరునాగారం, ఉట్నూరు, భద్రాచలం ఐటీడీఏ పీవో అంకిత్, వరుణ్రెడ్డి, గౌతం పొట్రు, ఏఎస్పీ అశోక్ కుమార్,డీడీలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం- డాక్టర్ చెన్నమనేని వికాస్



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి): అందరి భాగస్వామ్యంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని డాక్టర్ చెన్నమనేని వికాస్ రావుఅన్నారు .ప్రతిమ వైద్య విజ్ఞాన సంస్థ నగునూర్ కరీంనగర్ ఆధ్వర్యంలో మంగళవారం మెడిపల్లి మండలంలోని పోరుమల్ల గ్రామ పంచాయతీ ఆవరణలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని డాక్టర్ చెన్నమనేని వికాస్ , డాక్టర్ దీప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఅందరిభాగస్వామ్యంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమౌతుందని, కరోనా వంటి విపత్కర సమయంలో రైతులు చేసిన కృషి ఎనలేనిదని, దేశానికి అన్నం పెట్టిన రైతన్నలకు అండగా ప్రతిమ ఫౌండేషన్నిలుస్తుందని అన్నారు. పోరుమల్ల గ్రామ సర్పంచ్ విన్నపం మేరకు పోరుమల్ల గ్రామనికి ఉచిత అంబులెన్స్ ని త్వరలో అందిస్తామని డాక్టర్చెన్నమనేని వికాస్ తెలిపారు. ద క ి ు ణ భారతదేశంలోనేమొట్టమొదటిసారిగా ఆరోగ్యం మీ ముంగిట్లో అనే లక్ష్యంతో మారుమూల ప్రాంతాల్లోని నిరుపేదలకు వైద్యాన్ని ఉచితంగా అందించే ఉద్దేశంతో ప్రతిమ సంచార ఆరోగ్య రథం ద్వార ఎక్స్ - రే, ఎలక్ట్రో కార్డియోగ్రామ్, కార్డియాక్ ప్రొఫైల్, మమ్మోగ్రఫీ, మినీ లాబొరేటరీ , మహిళలకు రొమ్ము క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహించి 830 ఓ.పి , 433 మందికి పలు రకాల వైద్య పరీక్షలు ఆరోగ్య రథం ద్వారా అందించడం జరిగింది.

తదుపరి వైద్య పరీక్షల కోసం 56 మందిని ప్రతిమ ఆసుపత్రి కీ రిఫర్ చేయడం జరిగింది. అనంతరం డాక్టర్ చెన్నమనేని వికాస్ , డాక్టర్ దీవ పోరుమల్ల, కట్లకుంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల తో పాటు మెడిపల్లి మండలం లోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినిలకు మరియు పోరుమల్ల గ్రామ మహిళలకు,

యువతులకు ఉచిత సానిటరీ నాప్కిన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుపతి రెడ్డి,ఉప సర్పంచ్ రాజేందర్, మెడిపల్లి మాజి సర్పంచ్ దశరత రెడ్డి సర్పంచ్ ఖ్యాతం వరలక్ష్మి-మహేందర్ రెడ్డి, కట్లకుంట సర్పంచ్ నారాయణ రెడ్డి, తొంబర్రావుపేట్ సర్పంచ్ సత్తెమ్మ-ధర్మారెడ్డి, ఎంపీపీ ఉమాదేవి , పీఏసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ,గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు , ప్రతిమ ఫౌండేషన్ సభ్యులుపాల్గొన్నారు.

# నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు భారీ వరద.. 18 గేట్లు ఎత్తివేత

హైదరాబాద్, అక్టోబర్ 18:ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా నదికి భారీగా వరద పోటెత్తింది. దీంతో జూరాల నుంచి శ్రీశైలం మీదుగా నాగార్జున సాగర్కు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ.. ఉరకలేస్తోంది. భారీగా వరద వస్తుండటంతో.. నాగార్జున సాగర్ ప్రాజెక్టు 18 గేట్లను అధికారులు ఎత్తారు. ఈ దృశ్యాన్ని చూసేందుకు పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఆ జల సవ్వడిని పర్యాటకులు ఎంజాయ్ చేస్తున్నారు.

శ్రీశైలం రిజర్వాయర్ నుంచి 3,49,310 క్యూసెక్కుల ఇన్ఫ్లో వస్తుంది. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 588.90 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 312.0450 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 308.7641 టీఎంసీలుగా ఉంది. సాగర్ రిజర్వాయర్ నుంచి 3,11,926 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 884.80 అడుగులుగా ఉంది.

# సోదరుల కిడ్నాప్.. ఇద్దరి మృతదేహాలు లభ్యం, అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డ బాలుడు



న్యూఢిల్లీ, అక్టోబర్ 18: రాజస్థాన్లో కిడ్నాప్నకు గురైన ముగ్గురు అన్నదమ్ముల్లో ఇద్దరు ఢిల్లీలోని మెహ్రౌలీ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో శవాలై కనిపించారు. మరో బాలుడు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ దుశ్చర్యకు పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమన్ (13), విపిన్ (8), శివ (6) ముగ్గురు అన్నదమ్ములు. ఈ ముగ్గురు సోదరులను ఈ నెల 15న రాజస్థాన్లోని అల్వార్లో కిడ్నాప్నకు గురయ్యారు. ఆ తర్వాత కిడ్నాపర్లు ముగ్గురు పిల్లల తండ్రి గుసన్ సింగ్కు ఫోన్ చేసి, డబ్బులు డిమాండ్ చేశారు.

పిల్లల తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కాల్ ఆధారంగా ట్రాక్ చేశారు. ఢిల్లీ పోలీసులతో కలిసి రాజస్థాన్ పోలీసులు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఆ తర్వాత ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ తర్వాత పిల్లలను హత్య చేసినట్లుగా నిందితులు ఒప్పుకున్నారు. మెహ్రౌలీలోని అటవీ ప్రాంతంలో శవాలను పాతిపెట్టినట్లు చెప్పగా.. సంఘటనా స్థలం నుంచి అమన్, విపిన్ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే, మూడో బాలుడు శివ సైతం చనిపోయాడని భావించిన దుండగులు అక్కడే వదిలే వెళ్లడంతో బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడని పోలీసులు తెలిపారు.

బాలుడు సరైన వివరాలు తెలుపకపోవడంతో అప్పటికే అతన్ని బాలల పునరావాస కేంద్రానికి తరలించినట్లు పేర్కొన్నారు. నిందితులు ఇద్దరు పిల్లలను గొంతుకోసి హత్య చేశారని, పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. నిందితుడు బీహార్కు చెందినవాడని, అల్వార్లోని భివాడిలో బాధిత కుటుంబానికి దగ్గరలోనే నివసిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. డ్రగ్స్కు బానిసలై ఈ ఘాతుకానికి ఒడిగట్టాడరని పోలీసులు తెలిపారు. ఓ నిందితుడు దుకాణం నడుపుతుండగా.. మరో నిందితుడు ఓ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడని వివరించారు.

# బిల్కిస్ బానో కేసు నిందితుల విడుదలను సమర్థించిన కేంద్రమంత్రి..!

న్యూఢిల్లీ, అక్టోబర్ 18:బిల్కిస్ బానో నిందితుల విడుదల కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి సమర్థించారు. 'ప్రభుత్వం, సంబంధిత వ్యక్తులు నిర్ణయం తీసుకున్నప్పుడు ఇది చట్టబద్ధమైన ప్రక్రియ. కాబట్టి నేను దానిలో తప్పును గుర్తించలేదు' అన్నారు. 'కొంతకాలం జైలు జీవితం గడిపిన ఖైదీల విడుదల కోసం ఓ నిబంధన ఉన్నది. ఇదంతా చట్టప్రకారం జరుగుతుంది' అని పేర్కొన్నారు. గుజరాత్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ మీడియా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఈ విధంగా స్పందించారు.

మరో వైపు ఇటీవల కాంగ్రెస్ను వీడి బీజేపీలో చేరిన పటీదార్ ఉద్యమనేత హార్దిక్ పటేల్ సైతం దోషుల విడుదలకు మద్దతు తెలిపారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. మరో వైపు నిందితుల విడుదల ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మరో బీజేపీ నేత అల్పేశ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఖైదీల విడుదలను తాను అంగీకరించనని, అలాంటి వ్యక్తులను విడుదల చేసేందుకు సత్ప్రవర్తన ఒక్కటే సరిపోదని, జైలు నుంచి వచ్చిన నిందితులకు స్వీట్లు తినిపించడం సిగ్గుచేటన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి బిల్కిస్ బానో కేసులో 11 మంది నిందితులను ఇటీవల గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే.

నిందితులను విడుదల చేయడంపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. నిందితులకు రెమిషన్ మంజూరు చేయడంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో గతంలో విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విషయంలో విచారణకు సంబంధించి రికార్డులు సమర్పించడంతో పాటు దోషులకు మంజూరు చేసిన రెమిషన్ ఆర్డర్ను సమర్పించాలని గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు సోమవారం గుజరాత్ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆమోదం అనంతరమే నిందితులను విడుదల చేసినట్లు అఫిడవిట్లో పేర్కొన్నది. ఈ విషయంపై మంగళవారం సైతం సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. వచ్చే నెల 29న విచారణ జరిపేందుకు లిస్ట్ చేసింది.

# జమియత్ అహ్లే హదిస్ కు ఎల్లవేళలా ఎంఐఎం అండగా ఉంటుంది

## -ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్

## -నూతన కార్యవర్గానికి దారుస్సలాంలో ఆత్మీయ సన్మానం




కరీంనగర్, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర జమియత్ అహ్లే హదిస్ కు, ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలో పార్టీ నేతలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని.. నగరంలో సైతం ఎల్లవేళలా తన సహాయసహకారాలు ఉంటాయని ఎంఐఎం నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. సోమవారం రాత్రి జమియత్ అహ్లే హదిస్ నూతన కార్యవర్గం ఎన్నికల అనంతరం ఎంఐఎం ఉత్తర తెలంగాణ కార్యాలయంలో గులాం అహ్మద్ హుస్సేన్ ను మర్యాద పూర్వకంగా కలిసింది. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని, రాష్ట్ర నాయకత్వాన్ని దారుస్సలాం లో గులాం అహ్మద్, శుభాకాంక్షలు తెలిపి, ఆత్మీయంగా ఘన సన్మానం చేశారు. నగర జమియత్ అహ్లే హదిస్ అధ్యక్షుడిగా అబ్దుల్ లతీఫ్ ఖాలీద్ నద్వి, ప్రధాన కార్యదర్శిగా షేఖ్ హాఫీజుల్లా, కోశాధికారిగా మహమ్మద్ షఫీఖ్ అహ్మద్ లను, మెజార్టీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈఎన్నికలు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్, కన్వీనర్ సయ్యద్ హైదర్ పర్యవేక్షణలో జరిగాయి. ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర జమియత్ అహ్లే హదిస్ అధ్యక్షుడు నేమతుల్లా, ఉపాధ్యక్షుడు హుస్సేన్ మదని, యూసుఫ్ ఉమరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ నగర అధ్యక్షుడు అబ్దుల్ సమి, ప్రధాన కార్యదర్శి షేఖ్ సిరాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, ఎన్నికలకు సహకరించిన నగర జమియత్ అహ్లే హదిస్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పొలంలో పనిచేస్తుండగా విద్యుదాఘాతంతో రైతు దంపతులు మృతి

కరీంనగర్, అక్టోబర్ 18 (నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని చొప్పదండి మండలంలో విషాదం నెలకొంది. పొలంలో పనిచేస్తున్న భార్యాభర్తలకు కరెంట్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందారు. పెద్దపల్లికి జిల్లా సుల్తానాపూర్ మండలం ఎలిగేడు గ్రామానికి చెందిన జాతరకొండ ఓదేలుకు చొప్పదండి మండలం వెదురుగుట్ట గ్రామంలో వ్యవసాయ భూమి ఉంది. భార్య రజితతో కలిసి ఓదేలు ఇవాళ ఉదయం పొలం పనులకు వెళ్లారు.

పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు గమనించక ప్రమాదవాశాత్తు ఓదేలు మందు కొడుతుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్ కొట్టి కిందపడి పోయాడు. భర్తను రక్షించేందుకు వెళ్లిన భార్య రజిత కూడా విద్యుదాఘాతానికి లోనై మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొని ఉన్నాయి.




Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.